క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా కుంకుమ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ కన్నూరుదేవి తదితరులు

పరవాడ: తానాం గ్రామంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న పరదేశిమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం గ్రామ సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పైల జానకి, గొరుపూటి సతీష్, వర్రి వెంకటరమణ, పైల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్న సురేష్ రాజ్

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ రూ. 3 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం విరాళం మొత్తం చెక్కును స్వామివారి ఆలయం వద్ద గ్రామ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆయన గా అందజేశారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన విఘ్నేశ్వర పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నక్కెళ్ల అచ్చిబాబు, బుద్దల పరదేశి, గూడుపులోవ, నంబారు రాము, వంకర రమణ, బంధం శ్రీను,బుద్దల నరసింగరరావు, పిల్లల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రథం.. ప్రగతి పథం

- అభివృద్ధిలో రయ్‌రయ్
- మారిన మల్లునాయుడుపాలెం రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మల్లునాయుడుపాలెం సచివాలయం పరిధిలో జనాభా : 3,312 మంది
సచివాలయం పరిధిలో ఓటర్లు : 2,523 మంది
సంక్షేమ పథకాల ద్వారా అందించిన మొత్తం సొమ్ము : రూ.29.37 కోట్లు
డీబీటీ విధానంలో అందించిన సొమ్ము : రూ.14.24 కోట్లు
నాన్ డీబీటీ విధానంలో అందించిన సొమ్ము : రూ.4.69 కోట్లు
అభివృద్ధికి కేటాయించిన నిధులు : రూ.2.34 కోట్లు



లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)



పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి
జగనన్న అమ్మ ఒడి	344	రూ.1,56,16,060
జగనన్న విద్యాదీవెన	308	రూ.1,03,57,304
జగనన్న వసతిదీవెన	248	రూ. 37,50,563
రైతు భరోసా	553	రూ.2,77,74,000
పంటల బీమా	169	రూ. 2,62,573
సున్నా వడ్డీ పంట రుణాలు	38	రూ. 43,299
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	43	రూ. 78,228
వైఎస్సార్ పెన్షన్ కానుక	409	రూ.3,99,87,750
వైఎస్సార్ చేయూత	251	రూ.1,10,25,000
ఆసరా	606	రూ.1,45,67,809
సున్నా వడ్డీ	795	రూ. 11,06,827
ఈబీసీ నేస్తం	08	రూ.2,40,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	133	రూ.43,42,898
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	73	రూ. 7,23,211
హౌసింగ్	72	రూ. 83,87,944
వైఎస్సార్ బీమా	06	రూ. 9,30,000
వాహన మిత్ర	60	రూ. 18,70,000
జగనన్న చేదోడు	32	రూ. 6,50,000
కోవిడ్ సహాయం	840	రూ. 8,40,000
జగనన్న తోడు (వడ్డీ)	107	రూ. 60,460



మల్లునాయుడుపాలెం గ్రామ సచివాలయం

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం పంచాయతీ అభివృద్ధిలో పరుగులు తీసింది. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే సేవలు అందున్నాయి. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడంతో ప్రతి కుటుంబం స్వయం ఉపాధి సాధించే దిశగా అడుగులు వేస్తుంది. కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చి గ్రామ స్వరూపమే మారిపోయింది.దీంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ భరోసా ఇచ్చింది



నా భర్త రావాలయ్య 20 ఏళ్ల కిందట మృతి చెందాడు. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిపై ఆధారపడకుండా నా కాళ్లపై నేను ధైర్యంగా జీవిస్తున్నాను. జగన్‌బాబు నెలకు ఇస్తున్న రూ.3 వేల పింఛన్‌తో భరోసా లభించింది. పిల్లలకు కూడా భారం లేకుండా బతుకుతున్నాను. నాలాంటి వారికి ఎందరికో ఆధారంగా పింఛన్ నిలుస్తుంది.

–గొర్లి కన్నమ్మ, మల్లునాయుడుపాలెం

సంతృప్తిగా ఉంది



గ్రామంలో 19 మంది వలంటీర్లు పనిచేస్తున్నాం. ప్రభుత్వం అందించే అన్ని రకాలు సేవలు, సమాచారం ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తున్నాం.నా క్లస్టర్ పరిధిలో 59 కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు నా క్లస్టర్‌లో అర్హులైన వారితో దరఖాస్తు చేయించడం నుంచి వారికి అందించేందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నాను. లబ్ధిదారుల ఆనందం చూసి చాలా సంతృప్తిగా ఉంది.

–బోను నాగరాజు,మల్లునాయుడుపాలెం

గ్రామంలోనే సేవలు



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పాలనలో నూతన ఒరవడి తీసుకువచ్చారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహించడంతో వారు స్వావలంబన సాధించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కృషితో గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనతో గ్రామ స్వరూపం పూర్తిగా మారిపోయింది. విద్య,వైద్యంతో పాటు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందించేందుకు గ్రామంలోనే అవసరమైన ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి వచ్చాయి.

–బోను దేవుడమ్మ, సర్పంచ్, మల్లునాయుడుపాలెం

ఇంటి తలుపుతట్టి పథకాలు ఇచ్చాం



లబ్ధిదారులకు జంబో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

- కరోనా సమయంలో అండగా ఉన్నాం
- ఎన్నికల కోసం వచ్చిన వారిని తరిమికొట్టండి
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో పథకాల కోసం గత ప్రభుత్వాల వలే నాయకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. పాలనలో గత ప్రభుత్వాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు గమనించి తమ మద్దతు తెలపాలని కోరారు.

కరోనా సమయంలో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు పేద ప్రజలకు భరోసా ఇచ్చాయన్నారు. వలంటీర్లు గ్రామంలో ఉన్న వారు ఏపార్టీకి చెందిన వారో తెలిసినా పక్షపాతం చూపకుండా పథకాలు అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో కుటుంబాలను పక్కన పెట్టి,వారి ప్రాణాలను పనంగా సేవలందించారన్నారు.అటువంటి వలంటీర్లను టీడీపీ నాయకులు గజదొంగలతో పోల్చితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లు కుటుంబాల సమాచారం సేకరించి అమ్మాయిల అక్రమ రవాణా,చిన్నారుల అపహరణకు పాల్పడుతున్నారని దిగజారుడు విమర్శలు చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. వాడుకొని వదిలేయడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు.

రంగులు మార్చడం అలవాటు

జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబుకు ఒక జెండా, అజెండా లేదన్నారు.పార్టీలు,రంగులు మార్చడం ఆయనకు పరిపాటిగా వస్తుందన్నారు. ఎన్ని పార్టీలు పొత్తు పెట్టుకొని వచ్చినా వచ్చే న్నికలలో విజయం సాధించేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.అను నిత్యం ప్రజల కోసం ఆలోచిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు.

చెక్ అందజేత

4వ విడత చేయూత లబ్ధిదారులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ రూ.9.24 కోట్ల జంబో చెక్కు అందజేశారు. మండలంలోని 4,926 మంది అక్కచెల్లమ్మలకు లబ్ధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రామ్మోహనరావు, వెలుగు ఏపీఎం సాయిరమేష్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,వనం అచ్చెంనాయుడు,బైలపూడి దేముడు బాబు,వడ్డాది అప్పలరాజు,ఐడీ బాబు, యడ్ల నాయుడు,బోను గంగునాయుడు,ఉగ్గిన నాయుడు,మామిడి కొండాజీ,బండారు శ్రీను,దనిమిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమం
- వైఎస్సార్ చేయూత సభలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



లబ్ధిదారులకు జంబో చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: రాష్ట్రంలోని నిరుపేదలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. జీవీఎంసీ జోన్–8 పరిధిలోని వైఎస్సార్ చేయూత నాలుగో విడత సంబరాలను శుక్రవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికే రోల్ మోడల్‌గా రాష్ట్రంలో సంక్షేమం అమలవుతుందన్నారు. ముఖ్యంగా అక్క చెల్లెమ్మల కోసం సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పనితీరు చూసి ప్రతిపక్షాలు, కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు. టీడీపీ పాలనలో చంద్రబాబు ఒక్క పథకమైనా సక్రమంగా అమలు చేశాడా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

జంబో చెక్ అందజేత

మొత్తం 4,896 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.8.81 కోట్ల జంబో చెక్‌ను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అందించారు. కార్యక్రమంలో జెడ్పీ హైమావతి, ఏపీడీ శ్రీరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిరెడ్డి మురళి, యతిరాజుల నాగేశ్వరరావు, మెంటి మహేష్, రామరాజు, దాసరి సత్తిబాబు, నరసింహం పాల్గొన్నారు.

నోబెల్ అవార్డు విన్నర్ జిష్ణవ్‌కు ఎమ్మెల్యే అభినందన



జిష్ణవ్ ఆరోన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: మండలంలోని రాంపురంలో 18 నెలల చిన్నారి రెడ్డి జిష్ణవ్ ఆరోన్ అరుదైన గౌరవం పొందాడు. అత్యంత చిన్న వయసులోనే నోబుల్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో జంతువులు, పక్షులు, పండ్లు, వాహనాలు, పవ్వులు, కూరగాయాలు, రంగులు, శరీవ అవయవాలు, వస్తువులను గుర్తించిన ఆరోన్‌కు నోబెల్ వరల్డ్ రికార్డు సంస్థ ఈ అవార్డు అందించింది. ఈ సంధ్బంగా చిన్నారి ఆరోన్ తల్లిదండ్రులు రెడ్డి ఎర్నాయుడు, లీలావతి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిశారు. చిన్నారి జిష్ణవ్ ఆరోన్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం

- ఎస్పీ కేవీ మురళీ కృష్ణ మర్రిపాలెం
- పోలీస్ చెక్ పోస్టు ఆకస్మికంగా తనిఖీ



మర్రిపాలెంలోని పోలీస్ చెక్ పోస్టును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేవీ మురళీ కృష్ణ

సబ్బవరం:త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్ గేట్ సమీపంలో మర్రిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును ఎస్పీ కేవీ మురళీ కృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ఇటీవల అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. మరింత అప్రమత్తంగా,ఉత్సాహంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

గ్రీన్‌బెల్ట్ ఏరియాలో చెట్ల నరికివేత

పరవాడ: తాడి గ్రామ సమీపంలోని ఫార్మాసిటీ గ్రీన్ బెల్ట్ ఏరియాలో అక్రమంగా చెట్లు నరికి వేస్తున్న వారికి అడ్డుకట్ట వేయాలని తాడి గ్రామ అఖిల పక్ష కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బంజరులో అక్రమంగా చెట్లను తొలగించి పైపులైను పనులు చేస్తున్నారన్నారు. చెట్ల తొలగింపు, పైపులైన్ పనులను వెంటనే ఆపాలని తహసీల్దార్ తిరుపతిరావు, సీఐ ఎస్.బాలసూర్యారావుకు ఫిర్యాదు చేసినట్టు గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డవల్లి అప్పారావు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



ఆదిత్య శివకుమార్ (ఫైల్)

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో నెల రోజుల కిందట అద్దె ఇంట్లో దిగిన ఎ.వి.ఆదిత్య శివకుమార్(46) అనుమానాస్పదంగా మృతి చెందాడని వీఆర్వో పరవాడ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ ఎస్.బాలసూర్యారావు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం సేవిస్తూ కనిపించాడని స్థానికులు పోలీసులకు వివరించారు. బ్యాంకు ఆడిటర్‌గా పని చేస్తున్నట్లు చెప్పాడని స్థానికుల ద్వారా తెలిసింది. శివకుమార్‌కు కుటుంబ సభ్యులు ఎవరు లేరని సమాచారం. శివకుమార్ బ్యాంకు రుణాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి భారీగా సొమ్ము వసూలు చేసినట్లు తెలిసింది. ఇతనిపై హైదరాబాద్‌లో చీటింగ్ కేసులు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించి అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వివాహిత..

పరవాడ: మండలంలోని కలపాక గ్రామానికి చెందిన ఈదులపాక శ్యామల ఇంట్లో గురువారం ఉరివేసుకొని మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు పరవాడ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.బాలసూర్యారావు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. శ్యామల గురువారం తన బెడ్ రూంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మొగలిపురంలో బోరు బావి పనులకు భూమి పూజ చేస్తున్న రామునాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలో వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా మండల పరిషత్ నిధులతో నాలుగు బోరు బావులు ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. దీనిలో భాగంగా మొగలిపురంలో ఏర్పాటు చేయనున్న బోరు బావి ఏర్పాటు పనులను ఎంపీపీ సూర్యకుమారి శుక్రవారం ప్రారంభించారు. మొగలిపురంతో పాటు దుడ్డువాక,గుల్లేపల్లి,ఎ. శిరసపల్లి గ్రామాల్లో బోరుబావులు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోకం రామునాయుడు, బోను గంగునాయుడు,ఐడీ బాబు,గ్రామ పెద్దలు గండి బండయ్య,గుమ్మడి త్రినాథ్,కర్రి ముత్యాలయ్య,బయలపూడి దేవుడు,అప్పారావు,పైడి కొండ తదితరులు పాల్గొన్నారు.

మల్లునాయుడుపాలెం వార్డెన్‌కు పదోన్నతి



గోపీనాథరావు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం బీసీ హాస్టల్ వార్డెన్ వి. గోపీనాథరావుకు పదోన్నతి లభించింది. నర్సీపట్నం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు అందాయని గోపీనాథరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు రావలమ్మపాలెం బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఎంపీ చొరవతో అండర్ పాస్ వంతెన

అగనంపూడి: అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి చొరవ, కృషితో లంకెలపాలెం వాసులకు రైల్వే క్రాసింగ్ వంతెన సమస్య పరిష్కారమైందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వంతెనను ఆనుకొని అండర్ పాస్ వంతెన నిర్మాణానికి ఇటీవల రైల్వే బోర్డు అధికారులు రూ.నాలుగు కోట్ల 91లక్షలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ సత్యవతిని అభినందిస్తూ లంకెలపాలెంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామస్తులు 15 సంవత్సరాల పాటు అండర్ పాస్ వంతెన నిర్మించాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారన్నారు. ఇన్నాళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో ఎంపీ చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు, వార్డు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కర్రి నరసింగరావు, నాయకులు యలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..

కూర్మన్నపాలెం: ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా, చివరికి తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 1128వ రోజు సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు చేస్తున్న అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు